సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 11 । డిసెంబర్ । 2023



రోజుకో రూపంలో రామయ్య..

శ్రీ సీతారామచంద్రస్వామి వారు ముక్కోటి ఏకాదశి వేడుకల్లో భాగంగా రోజుకో రూపంలో దర్శనమివ్వనున్నారు. 10లో



..ఘరానా మోసం

ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కోచింగ్ పేరుతో పలువురిని ఘరానా మోసం చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 29° / 17°

జిల్లాలో సోమవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి పూట చలి ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణపుష్పార్చన



నిత్యకల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. భక్తులు స్వామివారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

అమ్మవారికి మొక్కుల చెల్లింపు



పెద్దమ్మతల్లి అమ్మవారు

పాల్వంచ: మండలంలోని శ్రీ కనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి) ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలు సమర్పించారు. అన్నప్రాశనలు, వాహన పూజలు నిర్వహించారు. తలనీలాలు, ఒడిబియ్యం, చీరలు, కనుములు తదితర మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ ఎన్.రజినీకుమారి పూజాది కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు రుద్రహోమం

ఆలయ ఆవరణంలో సోమవారం రుద్ర హోమం నిర్వహించనున్నారు. హోమంలో పాల్గొనే భక్తులు ముందుగా రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని ఈఓ కోరారు. వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

1.14 లక్షల మంది మహిళల ప్రయాణం

ఖమ్మంమామిళ్లగూడెం : మహాలక్ష్మి పథకాన్ని శనివారం మధ్యాహ్నం ప్రారంభించగా ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో ఆదివారం వరకు 1.14 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని ఆర్టీసీ అధికారులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు 38 వేల మంది, ఆదివారం 76 వేల మంది ప్రయాణించారని పేర్కొన్నారు. ఈ సంఖ్య రోజురోజుకూ పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండానే అనుమతిస్తున్నామని, విధి విధానాలు వచ్చే వరకు ఇలానే కొనసాగిస్తామని పేర్కొన్నారు.

రేపు గ్రహణమొర్రి పిల్లలకు స్క్రీనింగ్ క్యాంపు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని రైటర్‌బస్తీలో ఉన్న భవిత కేంద్రంలో ఈ నెల 12వ తేదీన ఉచితంగా గ్రహణ మొర్రి(పెదవి చిలుక, అంగిలి చిలుక)కు సంబంధించిన స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి, సమగ్ర శిక్ష–తెలంగాణ ఆధ్వర్యంలో డాక్టర్ ముకుందరెడ్డి సహకారంతో క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరు నెలల వయసు నుండి 50 సంవత్సరాల వయసులోపువారు ఈ శిబిరానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓలకు సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కె.సైదులును 98487 86166 నంబరులో సంప్రదించాలని కోరారు.

బలోపేతం చేయాలి

ఖమ్మం సహకారనగర్ : వీఆర్వో వ్యవస్థను బలోపేతం చేయాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా డ్రా పద్ధతిన ఇతర శాఖలకు సర్దుబాటు చేయడంతో ఉద్యోగుల హక్కులకు భంగం కలిగినట్లయిందని పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీలు నెరవేరుస్తాం

- మేనిఫెస్టోలోని అంశాలతోపాటు ఇతర మంచి కార్యక్రమాలూ అమలు చేస్తాం
- ఇందిరమ్మ రాజ్యం తేవడమే లక్ష్యంగా పనిచేస్తాం
- ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేల అభినందన సభలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి



సన్మానం అనంతరం అభివాదం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్ నాయక్, కూనంనేని, పాయం వెంకటేశ్వరు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ తదితరులు

పాల్వంచ: ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయం, చేనేత, సహకార శాఖల మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టాక ఆదివారం వారు తొలిసారిగా జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రులతోపాటు ఉమ్మడి జిల్లాలోని ఆరుగురు ఎమ్మెల్యేలకు ఆదివారం సుగుణ గార్డెన్స్‌లో అభినందన సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛం అందించి మిత్రపక్షాల నాయకులు మంత్రులకు, ఎమ్మెల్యేలకు అభినందనలు తెలిపారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం తేవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలు.. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీసాయం రూ.10 లక్షలకు పెంపు అమల్లోకి వచ్చాయని వివరించారు. మిగితా నాలుగు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. దశాబ్ద కాలం రాష్ట్రాన్ని పరిపాలించిన కేసీఆర్ ప్రజల సంపదను దోపిడీ చేశారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బహుళార్థ సాధక ప్రాజెక్టులు, పరిశ్రమలు వచ్చాయని గుర్తుచేశారు. గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు ద్రోహం చేసి బీఆర్‌ఎస్‌లో చేరగా, ఆయనను ఓడించాలని కసితో పనిచేసిన కార్యకర్తలు మిత్రపక్ష సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును గెలిపించారని అన్నారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలను నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు, పినపాక, సత్తుపల్లి, అశ్వారావుపేట, వైరా, కొత్తగూడెం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగమయి, జారె ఆదినారాయణ, రాందాస్ నాయక్, కూనంనేని సాంబశివరావు, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మట్టా దయానంద్, నాగ సీతారాములు, నూకల రంగారావు పాల్గొన్నారు

మొదటి స్థానంలో నిలిచేలా కృషి : తుమ్మల

ఉమ్మడి ఖమ్మం జిల్లాను వ్యవసాయ జిల్లాగా మార్చడంతోపాటు వ్యవసాయంలో ఇతర రాష్ట్రాల కంటే మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేస్తానని వ్యవసాయం, చేనేత, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ పామాయిల్‌ను అన్ని ప్రాంతాల్లో వేయాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో మన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడంతోపాటు, అహంకారాన్ని సహించబోమని నిరూపించామని గుర్తుచేశారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండి కాంగ్రెస్‌ను అధికారంలో తెచ్చిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉండటంతో ఇక్కడ అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. పది అసెంబ్లీ స్థానాల్లో తొమ్మిది గెలిచామని, ఒక్క సీటు పోవడాన్ని కూడా సరిదిద్దుకుంటామని పేర్కొన్నారు.

ఇది ప్రజారాజ్యం: పొంగులేటి

పదకొండు సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో ఎన్నో కష్టాలు అనుభవించానని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ 3వన వెలువడిన ఫలితాలతో తన కష్టానికి ఫలితం లభించిందని అన్నారు. ఇప్పటికే రాష్ట్రం అప్పులు, దోపిడీకి గురైందని, అయినా వాటిని పూడ్చుకుంటూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఇది ప్రజారాజ్యమని, ఎక్కడా ఇబ్బందిపడే పరిస్థితి ఉండదని చెప్పారు. ఇళ్లులేని వారికి ఇళ్లు కట్టించే బాధ్యత తనదేనని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేస్తామని వివరించారు.

శ్రేణులను అదుపు చేయలేకపోయిన పోలీసులు

మంత్రులు, ఎమ్మెల్యేల అభినందన సత్కార సభ ఆద్యంతం గందరగోళంగా మారింది. ఈ సభకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో హాల్ నిండటంతోపాటు సభా వేదిక ముందుకు వందలాదిగా వచ్చి నిల్చుండి పోయారు. వేదిక కూడా జనాలతో కిక్కిరిసిపోయింది. పోలీసులు అక్కడికి వచ్చిన వారిని నిలువరించలేకపోయారు. వక్తలు మాట్లాడాక పుష్పగుచ్ఛాలు, వినతి పత్రాలు అందించేందుకు, సన్మానాలు చేసేందుకు, ఫొటోలు దిగేందుకు కార్యకర్తలు ఒక్కసారిగా స్టేజీపైకి ఎక్కారు. పరిస్థితిని పోలీసులు అదుపుచేయలేకపోవడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చొరవ తీసుకుని వేదిక చుట్టూ తిరుగుతూ కార్యకర్తలను సముదాయించారు. సభా వేదికపై సీటు దొరకక పోవడంతో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోఫా చివరి భాగంలో కూర్చుండి పోయారు. సభలు వక్తలు మాట్లాడుతున్న ప్రతీసారి కార్యకర్తలు ఉత్సాహంతో కేరింతలు, కేకలు, ఈలలు వేశారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సింగరేణి డైరెక్టర్



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సింగరేణి డైరెక్టర్ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని ఆదివారం సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్. బలరామ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి గనులు, సోలార్ విద్యుత్, థర్మల్ విద్యుత్ తదితర అంశాలపై చర్చించినట్లు డైరెక్టర్ తెలిపారు. కాగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా జిల్లాకు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు కొత్తగూడెంలో సింగరేణి అధికారులు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్, డైరెక్టర్ (పి అండ్‌పి) జి. వెంకటేశ్వరరెడ్డి, జీఎంలు కట్టా బసవయ్య, దీక్షితులు, సీహెచ్ శశిధర రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఆదివారం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలో మూడు సెంటర్లు ఏర్పాటు చేయగా, జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వరాచారి పర్యవేక్షించారు. 536 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 523 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారని డీఈఓ తెలిపారు.

దేశంలో లౌకికవాదం వర్ధిల్లాలి

భద్రాచలం: భద్రాద్రి రామయ్య ఆశీస్సులతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండేలా, రామరాజ్యంను స్థాపించేందుకు శక్తిని ప్రసాదించాలని రామయ్యకు ప్రత్యేక పూజలు చేసినట్లు మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం భద్రాచలం వచ్చిన వారికి బ్రిడ్జి సెంటర్ వద్ద డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయానికి చేరుకోగా, ఈఓ రమాదేవి, పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలోని మూలమూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు కష్ట నష్టాలకు ఇక తెరపడనుందని అన్నారు. భద్రాచలం ఆలయం మతసామరస్యానికి ప్రతీక అని, తమ ప్రభుత్వం దేశంలో లౌకికవాదం వర్ధిల్లాలని కోరుకుంటుందని చెప్పారు. భద్రాచలం అభివృద్ధికి తగిన ప్రణాళికలను రూపొందిస్తామన్నారు. వీరి వెంట పినపాక, అశ్వారావుపేట, వైరా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, రాందాస్‌నాయక్ ఉన్నారు.



పూజలు చేస్తున్న భట్టి, తుమ్మల, పొంగులేటి

పారదర్శకంగా హాజరు నమోదు

- కొత్తగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను ప్రవేశపెట్టిన విద్యాశాఖ
- ఇప్పటికే జిల్లాలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు
- మిగిలిన స్కూళ్లలో కూడా అమలు చేసేందుకు చర్యలు



విద్యార్థుల హాజరును నమోదు చేస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నమోదులో విద్యాశాఖ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు రాకపోయినా హాజరు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా హాజరు నమోదు చేసేందుకు ఎఫ్ఆర్ఎస్(ఫేస్ రికగ్నిజేషన్ సిస్టమ్) అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తుండగా, మిగిలిన స్కూళ్లలోనూ పకడ్బందీగా అమలు చేసేలా జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీంతోపాటు విద్యార్థులకు పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబర్లను సైతం కేటాయించారు. ఆ నంబర్ ఎస్సెస్సీ మెమోలో కూడా ఎంట్రీ కానుంది. ఆ నంబర్ ప్రకారం విద్యార్థుల చదువుకు సంబంధించి సమస్త సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుంది.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా..

విద్యార్థుల హాజరు, పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబర్, డిజిటల్ బోర్డుల్లో పాఠ్యాంశాల బోధన తదితర కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ అవుతున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారనున్నాయి. దీంతో అన్ని వర్గాల వారు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం కూడా అమలు అవుతుండటంతో ప్రభుత్వ విద్యకు డిమాండ్ పెరగనుంది.

యాప్‌లో నమోదు ఇలా..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల హాజరు నమోదుకు విద్యాశాఖ నూతనంగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను అమల్లోకి తెచ్చింది. ఫేస్ రికగ్నిజేషన్ ద్వారా సిస్టంలో హాజరు నమోదు చేస్తున్నారు. మొదటి పీరియడ్‌లో విద్యార్థుల హాజరు నమోదు బాధ్యతను ఉపాధ్యాయులకు అప్పగించారు. ఉపాధ్యాయులు వారి సెల్ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, యాప్ ద్వారా విద్యార్థులను వీడియో తీస్తారు. అందులో కనిపించని విద్యార్థులను గైర్హాజరుగా పరిగణిస్తారు. రోజూ ఉదయం 10.30 గంటల వరకు హాజరునమోదు పూర్తి చేయాలని విద్యాధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని కొన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సమస్య ఉండగా, ఆ ప్రాంతాల్లో కూడా యాప్‌ను వినియోగించవచ్చు. ఇంటర్‌నెట్‌తో సంబంధం లేకుండానే యాప్‌ను ఓపెన్ చేసి సింక్ అనే ఆప్షన్ నొక్కగానే అటెండెన్స్ అప్‌డేట్ అవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. జిల్లాలోని 1,071 పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను ఉపయోగించి 77,652 మంది విద్యార్థుల హాజరును రోజూ నమోదు చేస్తున్నారు. హాజరు ఆధారంగానే భవిష్యత్‌లో విద్యార్థులకు యూనిఫామ్, టెక్స్‌బుక్స్, మిడ్డే మీల్స్ తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. హెచ్‌ఎంలు విద్యార్థుల వివరాలను ఎఫ్ఆర్ఎస్‌లో రిజిస్ట్రేషన్ అయ్యేలా చూడాలని అధికారులు సూచిస్తున్నారు.

రోజూ నమోదు చేయాలి

జిల్లాలోని ప్రతీ పాఠశాలలో నూతనంగా ప్రవేశపెట్టిన ఎఫ్ఆర్ఎస్‌లో విద్యార్థుల హాజరు నమోదు చేయాలి. ఉపాధ్యాయులు అలసత్వం లేకుండా మొదటి పీరియడ్‌లో ప్రక్రియను పూర్తి చేయాలి. అవకతవకలు లేకుండా ఉండేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

–వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాధికారి

ఇంటర్‌నెట్ లేకున్నా..

పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నమోదుకు విద్యాశాఖ నూతనంగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను ప్రవేశపెట్టింది. విద్యార్థులకు సంబంధించిన ఫొటో, వారి వివరాలను మొదట రిజిస్ట్రేషన్ చేస్తారు. ఆ తర్వాత పాఠశాలలో గ్రూప్ అటెండెన్స్ తీయగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో నమోదు అవుతుంది. ఇది పారదర్శకంగా ఉంటుంది.

–ఎస్.సతీష్, జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్

కొండదిగిన కోడి



పడిపోయిన చికెన్ ధరలు

- ఉత్పత్తి పెరగటంతో ధర పతనం
- కార్తీక మాసం మరో కారణం
- స్కిన్‌తో కిలో రూ.130, స్కిన్ లెస్ రూ.150



కోళ్ల పరిశ్రమ

ఖమ్మంవ్యవసాయం: కోడి మాసం ధరలు తగ్గాయి. వేసవిలో కిలో రూ. 300 వరకు పలకగా ప్రస్తుతం సగానికి తగ్గింది. సాధారణంగా రూ. 200 నుంచి రూ. 250 వరకు ఉండే చికెన్ ధర ప్రస్తుతం గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం స్కిన్ లెస్ చికెన్ కిలో ధర ప్రాంతాన్ని, కంపెనీని బట్టి రూ. 150 నుంచి రూ.160 వరకు విక్రయిస్తున్నారు. స్కిన్‌తో అయితే రూ.130 వరకే అమ్ముతున్నారు. కోడి(లైవ్ బర్డ్) కిలో ధర రూ. 70 నుంచి రూ. 75 వరకు విక్రయిస్తున్నారు. ఇక హోల్‌సేల్ ధరలు మరికొంత తక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం శుభకార్యాలు, పెళ్లిళ్లు జోరుగా సాగుతున్నప్పటికీ చికెన్‌కు అంతగా డిమాండ్ లేదు. ధర తగ్గడానికి అనేక కారణాలు ఉన్నాయని వ్యాపారులు, రైతులు(ఉత్పత్తిదారులు) విశ్లేషిస్తున్నారు. జిల్లాలో ప్రతి ఆదివారం 50 టన్నుల చికెన్ విక్రయం జరుగుతుంది. ఒక్క ఖమ్మం నగరంలోనే 25 టన్నుల వరకు విక్రయిస్తారు.

పెరిగిన ఉత్పత్తి..

ప్రస్తుత సీజన్‌లో రైతులు కోళ్ల ఉత్పత్తిని గణనీయంగా పెంచారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం కోళ్ల ఉత్పత్తి బాగుందని వ్యాపారులు, రైతులు చెబుతున్నారు. ఓ వైపు శుభకార్యాలు, మరో వైపు తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో వినియోగం అధికంగా ఉంటుందని బావించిన రైతులు కోళ్ల ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అయితే ఉత్పత్తికి తగిన విధంగా వినియోగం లేకపోవటంతో చికెన్ ధరలకు డిమాండ్ తగ్గింది.

అంచనాలు తలకిందులై రైతుల ఇక్కట్లు..

చికెన్ వినియోగంపై అంచనాలు తలకిందులు కావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఒక పిల్ల ధర రూ. 50 వరకు ఉంటుంది. ఇక కిలో బరువు వచ్చేంత వరకు కోడిని పెంచేందుకు రూ.100 ఖర్చవుతుంది. సాధారణంగా పరిశ్రమలో 2 కిలోల బరువు వరకు కోళ్లను పెంచుతారు. ఆ బరువుతో ఉన్న కోళ్లను నిల్వ ఉంచుకుంటే దాణా ఖర్చు బాగా పెరుగుతుంది. దీంతో రైతులు ధరలను తగ్గించి విక్రయాలకు ప్రాధాన్యం ఇస్తుంటారు. ప్రస్తుతం అదే జరుగుతోంది. ఉత్పత్తికి తగిన విధంగా విక్రయాలు లేకపోవటంతో ధర క్షీణించింది.

ఆధ్యాత్మిక మాసం కావడంతో..

చికెన్ ధరలు తగ్గటానికి మరో కారణం కార్తీక మాసం. సహజంగా కార్తీక మాసంలో మాంసాహారాల ధరలు తక్కువగా ఉంటాయి. అయితే ఈ ఏడాది చికెన్ ధరలు మరికొంత తగ్గాయి. కార్తీక మాసంలో ప్రధానంగా హిందువులు ఆధ్యాత్మికతతో ఉంటారు. ఈ నెలలో ఎక్కువ మంది మాంసాహారం తినరు. కొందరు ఇళ్లలో మాంసాహార వంటలను కూడా ఈ నెల రోజుల పాటు పూర్తిగా మానేస్తారు. దీంతో ఈ మాసంలో చికెన్ వినియోగం బాగా తగ్గింది. గత ఏడాది కార్తీక మాసంలో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ. 180 ఉండగా. ఈ ఏడాది మరింతగా తగ్గించి రూ.150 చొప్పున విక్రయిస్తున్నారు.

అందుబాటులో చికెన్ ధర



చికెన్ ధరలు అందుబాటులో ఉన్నాయి. వేసవి, వానాకాలంతో పోలిస్తే ప్రస్తుతం చికెన్ ధరలు బాగా తగ్గాయి. నెల రోజుల క్రితం రూ. 220 పలికిన చికెన్ ధర ప్రస్తుతం రూ. 150 వరకే ఉంది. కార్తీక మాసం కావడంతో ధరలు తగ్గాయని భావిస్తున్నాం. చికెన్ ధర తగ్గటం శుభకార్యాలు నిర్వహించే వారికి ప్రయోజనం.

– సోమారపు సుధీర్, ప్రకాష్‌నగర్, ఖమ్మం

డిమాండ్ లేకే ధర పతనం



ఉత్పత్తికి తగిన డిమాండ్ లేకనే చికెన్ ధరలు తగ్గాయి. గతంతో పోలిస్తే గణనీయంగా కోళ్ల పరిశ్రమలు పెరిగాయి. దీంతో కోళ్ల ఉత్పత్తి పెరిగింది. కోళ్ల ఉత్పత్తికి తగిన విధంగా వినియోగం లేదు. దీంతో విక్రయాలు తగ్గాయి. ఈ పరిస్థితిలో విక్రయదారుల కన్నా ఉత్పత్తిదారులకే నష్టం జరుగుతుంది.

– రావి బాబూరావు, పౌల్ట్రీ పరిశ్రమ యజమాని, ఖమ్మం

అలరించిన సినీ సంగీత విభావరి

ఖమ్మంగాంధీచౌక్: అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా ఖమ్మం స్వర మాధురి కల్చరల్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ఘంటసాల చిత్ర పటానికి కల్చరల్ యూనిట్ ప్రతినిధులు, అతిథులు నివాళులు అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన మధుర గీతాలను గాయనీ గాయకులు సుధారాణి(విజయవాడ), వి.మాలతి నాయుడు(ఖమ్మం), జి శకుంతల నవీన్, వీవీ రెడ్డి, ఆదిరాజు పురుషోత్తం, ఇబ్రాయిల్, పున్నయ్య, ప్రకాష్, ఇమామ్ తదితరులు ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదాయ పన్ను శాఖ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్ హాజరు కాగా, నెల నెలా వెన్నెల ప్రధాన కార్యదర్శి ఏఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాయకులు, నిర్వాహకులు

క్లుప్తంగా

విశ్రాంత ఉపాధ్యాయురాలికి 'మహానంది' అవార్డు



పూసం రవికుమారిని సత్కరిస్తున్న ఏఎన్ఎస్ సంస్థ నిర్వాహకులు

భద్రాచలం: భద్రాచలానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు, మానవ హక్కుల సంఘం జిల్లా సెక్రటరీ పూసం రవికుమారికి మహానంది జాతీయ అవార్డు వరించింది. సామాజిక, కళా, విద్యారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను ఈ అవార్డును నిర్వాహకులు ప్రకటించారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని మల్కాజిగిరిలో ఏఎన్ఎస్ 24 సంస్థ ఆధ్వర్యాన జరిగిన మహానంది పురస్కార మహోత్సవ కార్యక్రమంలో ఆమెను ఘనంగా సత్కరించి అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన మానుకొండ నాగరాజు, డాక్టర్ చింతపట్ల వెంకటాచారి, అశోక్‌కుమార్, రవీంద్ర ఆచార్యులు, వనపర్తి పద్మావతిలు పాల్గొన్నారు.

వర్ధమాన గాయకుడికి 'కాకతీయ మహానంది'..



పురస్కారం అందిస్తున్న కమిటీ ప్రతినిధులు

బూర్గంపాడు: మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన వర్ధమాన గాయకుడు కోట దుర్గాప్రసాద్‌కు కాకతీయ మహానంది పురస్కారం దక్కింది. కళారంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి ఏఎస్ఎస్ 24 సంస్థ ఆధ్వర్యాన ఆదివారం హైదరాబాద్‌లో అవార్డుల ప్రదానోత్సవం చేశారు. సినీ, భక్తి పాటలు ఆలపించే దుర్గాప్రసాద్‌కు కాకతీయ మహానంది పురస్కారంతో నిర్వాహకులు సత్కరించారు.

'మహాలక్ష్మి' చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది..

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): నూతనంగ ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని కొత్తగూడెం శాసనస భ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంలో పథకాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి, మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయడం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమవుతుందన్నారు. మహిళల కష్టాలను గుర్తించి మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయడం అభినందనీయమని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకంలో భాగమైన రూ.500లకు వంట గ్యాస్ సిలిండర్ కొద్దిరోజుల్లోనే అమల్లోకి వస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతీ సంక్షేమ పథకాన్ని అర్హులైన ప్రతీ పేదవాడి గడపకు చేరేలా చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఆర్డీఓ శిరీష, కౌన్సిలర్ ధర్మరాజు, డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వర్లు, సునీత, కందుల భాస్కర్, వంగా వెంకట్, బొంకూరు పరమేశ్, రత్నకుమారి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.12,454

సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీతో మేధాశక్తి

- విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన
- భారీగా హాజరై ప్రతిభ చూపిన విద్యార్థులు
- ఉత్సాహం నింపిందని కితాబు

SAKSHI SPELL Bee 2023-24

ఖమ్మం సహకారనగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సాక్షి మీడియా చేస్తున్న కృషి అభినందనీయమని, సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ పరీక్షలు నైపుణ్యం మెరుగుపర్చుకునేందుకు ఎంతో దోహదపడతాయని రెజొనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు వెల్లడించారు. సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయిలో సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీ పరీక్షలను నగరంలోని రెజొనెన్స్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెజొనెన్స్ డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని పోటీ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీ పరీక్షలు దోహదపడతాయన్నారు. ఇలాంటి పోటీ పరీక్షలను నిర్వహించటం ద్వారా విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరగటంతో పాటు మరిన్ని పరీక్షలకు సిద్ధమయ్యే అవకాశం ఉందన్నారు. సాక్షి మీడియా వివిధ స్థాయిల్లో పరీక్షలను నిర్వహించి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసే ప్రయత్నం చేస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. తొలుత పాఠశాల స్థాయిలో పరీక్షలు నిర్వహించగా ప్రతిభ కనబర్చిన వారికి జిల్లా స్థాయిలో పరీక్షలను నిర్వహించారని చెప్పారు.



స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

స్పెల్ బీలో ప్రతిభ కనబర్చిన వారు రీజినల్ స్థాయికి వెళ్లనుండగా.. మ్యాథ్ బీలో ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్రస్థాయికి వెళ్లనున్నారు. రెజొనెన్స్ కళాశాలలో జరిగిన పరీక్ష కేంద్రంలో నగరంలోని సర్వజ్ఞ స్కూల్, నిర్మల్ హృదయ్, రెజొనెన్స్ ఇన్ఫో, హార్వెస్ట్, హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్, మిలీనియం, త్రివేణి, బ్లూమింగ్ మైండ్స్, బీబీఎం, శ్రీరామకృష్ణ విద్యాలయాలు, మధిరకు చెందిన ఠాగూర్ విద్యానికేతన్, భరత్ విద్యానికేతన్, శ్రీనిధి, నారాయణ, సత్తుపల్లికి చెందిన కేకేఆర్ గౌతమ్, కొత్తగూడెంలోని త్రివేణి, భద్రాచలానికి చెందిన సెయింట్ పాల్స్‌లూథరన్ పాఠశాలల విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. కాగా బ్రాంచ్ మేనేజర్ మోహన్‌కృష్ణ, ఈవెంట్ ఆర్గనైజర్ వేణు, యాడ్స్ మేనేజర్ శేషు, నందకుమార్, పాషా, సాక్షి సిబ్బంది పరీక్షలను పర్యవేక్షించారు. కార్యక్రమానికి ప్రెజెంటింగ్ స్పాన్సర్ డ్యూక్స్ వ్యాపి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లు వ్యవహరించాయి.



మ్యాథ్ బీ పరీక్షను పర్యవేక్షిస్తున్న రెజొనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్ ఆర్‌వీ నాగేంద్రకుమార్, బ్రాంచ్ మేనేజర్ మోహన్‌కృష్ణ

SAKSHI MATH BEE 2023-24

పోటీ పరీక్షలకు ఉపయోగం..



సాక్షి మ్యాథ్ బీ పరీక్షను రాయటం ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో జరిగే పోటీ పరీక్షలను సులభంగా రాసేందుకు దోహదపడుతుంది. పోటీ పరీక్షలను ఏ విధంగా రాయాలనే అవగాహన వచ్చింది. సాక్షి మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు. భవిష్యత్‌లో మరిన్ని పరీక్షలు నిర్వహిస్తే బాగుంటుంది.

– అఫియా కౌజిన్, 2వ తరగతి, మిలీనియం, ఖమ్మం (మ్యాథ్ బీ)

ఆలోచించి రాశాను..



మనకు ఉన్న సమయంలో ఆలోచించి రాస్తే సులభంగా రాయగలం. ప్రతి ప్రశ్నను మొదటిగా చదివి అర్థం చేసుకోవాలి. దానికి అనుగుణంగా సులభంగా జవాబులు రాసే అవకాశం ఉంటుంది. మరిన్ని పరీక్షలు నిర్వహించి నూతనోత్సాహాన్ని తీసుకురావాలి.

– వి.వినీషారెడ్డి, 7వ తరగతి, నిర్మల్ హృదయ్, ఖమ్మం (మ్యాథ్ బీ)

పరీక్ష రాయటం సంతోషం..



పరీక్ష రాయటం ఎంతో సంతోషాన్నిచ్చింది. పోటీ పరీక్షలు ఏవిధంగా రాయాలనే అంశంపై ఒక అవగాహన వచ్చింది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో స్పెల్ బీ పరీక్షను నిర్వహించటం ద్వారా మాకు ఉన్న భయాలు పోయాయి. ఈ పరీక్ష భవిష్యత్‌లో ఉపయోగపడుతుందనే నమ్మకం ఉంది.

– జి.మాన్వి, 5వ తరగతి, సర్వజ్ఞ, ఖమ్మం (స్పెల్ బీ)

కొత్త అంశాలు తెలిశాయి..



స్పెల్ బీ పరీక్షను రాయటం ద్వారా కొన్ని పదాలు, కొత్త అంశాలు తెలిశాయి. సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ పరీక్షను రాయటం ఆనందంగా ఉంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఇలాంటి పరీక్షలు బాగా ఉపయోగపడతాయి. పరీక్ష సులభంగా రాయడంతో ఎంతో ఉత్సాహాన్ని కలిగించింది.

– ఎస్‌కే వాలీద్ సైఫ్ హసన్, 9వ తరగతి, కేకేఆర్ గౌతమ్, సత్తుపల్లి (స్పెల్ బీ)

విజ్ఞానం పెరుగుతుంది..



సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షల వల్ల విజ్ఞానం పెరుగుతుంది. పరీక్షలను ఎలా రాయాలనే విషయాలు స్పష్టంగా తెలిశాయి. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే పరీక్షలను సులభంగా రాయవచ్చు. భవిష్యత్‌లో మరిన్ని పరీక్షలు నిర్వహించి, విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగుపర్చాలి.

– ఎస్‌కే యాసినా, 8వ తరగతి, శ్రీనిధి, మధిర (మ్యాథ్ బీ)

పోటీతత్వం పెరుగుతుంది..



ఇలాంటి పరీక్షలు రాయటం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుంది. పాఠశాలలు కేవలం సబ్జెక్ట్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తుండగా సాక్షి మీడియా వారు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని స్పెల్ బీ, మ్యాథ్ బీ పరీక్షలను నిర్వహించటం అభినందనీయం. ఇంకా మరిన్ని నిర్వహించాలి.

– కె.మోక్షిత, 9వ తరగతి, నారాయణ, మధిర, (మ్యాథ్ బీ)


నైపుణ్యం పెరుగుతుంది..



స్పెల్ బీ పరీక్షను రాయటం ద్వారా కొత్త విషయాలు తెలియటంతో పాటు సబ్జెక్ట్‌పై మరింత అవగాహన వచ్చింది. ప్రశ్నాపత్రం తీసుకున్న సమయం నుంచి ముగింపు వరకు ఏ ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలనే విషయం తెలిసింది. ఇలాంటి పోటీ పరీక్షలను రాయటం ద్వారా సబ్జెక్ట్‌పై అవగాహన వస్తుంది.

– ఎస్.శ్రీసాయిసాత్విక్, 6వ తరగతి, సెయింట్ పాల్స్ లూథరన్, భద్రాచలం (స్పెల్ బీ)

ఇండోర్ జాతీయ సమావేశాలకు సోమశేఖర్



పరిమి సోమశేఖర్

భద్రాచలం: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ నెల 15 నుంచి 17 వరకు ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యాన జరిగే జాతీయ సమావేశాలకు తొలిసారి భద్రాచలంకు చెందిన కెమిస్ట్ పరిమి సోమశేఖర్‌కు ఆహ్వానం అందింది. దేశస్థాయిలో జరిగే ఈ సమావేశాలకు హాజరయ్యే అవకాశం అత్యంత అరుదుగా ఉండడం గమనార్హం. గత 23 ఏళ్లుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా, భద్రాచలం డివిజన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అసోసియేషన్‌లో పలు హోదాలలో పనిచేసి విశిష్ట సేవలు అందించిన ఆయన ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ.. తనకిచ్చిన ఈ అవకాశాన్ని కెమిస్ట్‌ల సమస్యలను జాతీయ స్థాయిలో చర్చించడానికి సద్వినియోగం చేస్తానని తెలిపారు.

సింగరేణి సొమ్ము వాడుకున్న కేసీఆర్ ప్రభుత్వం

- మోదీ, కేసీఆర్ విధానాలతోనే ప్రైవేట్‌కు బొగ్గు బ్లాకులు
- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు



మాట్లాడుతున్న మందా నర్సింహారావు

ఇల్లెందు: సింగరేణి సంస్థ సొమ్ము రూ. 29 వేల కోట్లను గత కేసీఆర్ ప్రభుత్వం ఏటీఎంలా వాడుకుందని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు ఆరోపించారు. ఆదివారం ఇల్లెందు జేకే ఓసీలో జరిగిన పిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అందుకే లాభాల బాటలో ఉన్నా వేతనాల చెల్లింపునకు కటకటగా ఉందని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని కేసీఆర్ విధానాల వల్లే బొగ్గు బ్లాకులు ప్రైవేటుకు వెళ్లాయని, వచ్చే 15 ఏళ్లలో సింగరేణి అంధకారంలోకి వెళుతుందన్నారు. గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ పైరవీల సంస్థగా మారిపోయిందని విమర్శించారు. ఇల్లెందులోని పూసపల్లి ఓసీకి అనుమతి రాకపోయినా ప్రైవేట్‌కు అప్పగిస్తున్నారని తెలిపారు. సింగరేణిలో బొగ్గు టన్ను రూ.4500 ఉంటే, అదానీ బొగ్గు టన్ను రూ.18వేలు ఉందని అన్నారు. టీబీజీకేఎస్ నాయకులు నైట్ డ్యూటీలు, ట్రాన్స్‌ఫర్లు, డిప్యూటేషన్లు, కారుణ్య నియమాకాలు ఇలా రకరకాల పేర్లతో కార్మికుల నుంచి భారీగా వసూళ్లు చేశారని ఆరోపించారు. రామగుండంలో క్వార్టర్లు కూల్చి ఓ నేత చేపట్టిన ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారిని బదిలీ చేయించారని విమర్శించారు. సింగరేణిలో 50 వేల క్వార్టర్లు ఉన్నాయని అందులో 20 వేల క్వార్టర్ల అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. పోలీస్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులకు క్వార్టర్లు ఇస్తున్నారని, వారు కరెంటు బిల్లులు కూడా కట్టడం లేదన్నారు. కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేసే సీఐటీయూను రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాచర్ల గోపాల్, కృష్ణయ్య, ఎండీ అబ్బాస్, సిరాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు పోలీసుల గౌరవ వందనం

బూర్గంపాడు: డిప్యూటీ ముఖ్యమంత్రిగా జిల్లాకు తొలిసారిగా వచ్చిన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కకు సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో పోలీసులు గౌరవ వందనం చేశారు. తొలుత కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ డాక్టర్ వినీత్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కలెక్టర్ ప్రియాంక పుష్పగుచ్ఛాలు అందించారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



రాష్ట్ర మంత్రి పొంగులేటికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రియాంక



రాష్ట్ర మంత్రి తుమ్మలకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రియాంక

నిరుపేదలకు వరం 'ఆరోగ్యశ్రీ'

ఎమ్మెల్యే వెంకట్రావ్, పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: నిరుపేద ప్రజలకు ఆరోగ్యశ్రీ వైద్య సాయం పెంపు ఓ వరమని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌లు అన్నారు. ఆదివారం భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం వైద్య సాయం రూ.10 లక్షలకు పెంపు పథకాన్ని వారు ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. నాటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకం ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిందని, అటువంటి పథకాన్ని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల గరిష్ట పరిమితికి పెంచడం శుభపరిణామని పేర్కొంటూ ఆరోగ్యశ్రీ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రులతో పాటుగా ప్రైవేట్ వైద్య సాయం కూడా పొందొచ్చని, పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ నేపథ్యాన భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తామని, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కావాల్సిన మౌలిక వసతులను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ మంగీలాల్, తహసీల్దార్ శ్రీనివాస్, ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, పీఓ, ఆర్‌డీఓ తదితరులు

భద్రాచలంలో చోరీలు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఆదివారం వారం తెల్లవారుజామున రెండు చోట్ల గుర్తు తెలియని దొంగలు చోరీలకు పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అశోక్‌నగర్‌కాలనీకి చెందిన ఒక ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో తెల్లవారు జామున గుర్తు తెలియని దొంగలు లోపలికి ప్రవేశించి రూ.80 వేల నగదును అపహరించుకుపోయారు. అదేవిధంగా యూబీరోడ్‌లోని వస్త్ర దుకాణంలో ప్రవేశించిన దొంగలు రూ.2 లక్షల నగదుతో పాటు ఖరీదైన వస్త్రాలను అపహరించుకుపోయారు. ఈ రెండు ఘటనలపై పట్టణ సీఐ నాగరాజురెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీలో భద్రాచలం వాసి మృతి



మృతి చెందిన క్రాంతికుమార్

భద్రాచలం: ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డిగూడెం మండలం వేగవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భద్రాచలం వాసి మృతి చెందాడు. ఆదివారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. భద్రాచలం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకు చెందిన అవివాహితుడు ఉజ్జగిరి క్రాంతికుమార్ (31) కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. కాగా, వ్యక్తిగత పనులపై భద్రాచలం నుంచి జంగారెడ్డిగూడెం వైపు తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని లారీ వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో క్రాంతికుమార్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న అక్కడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి



మృతిచెందిన దుప్పి

పాల్వంచ: అడవి నుంచి రోడ్డుపైకి వచ్చిన దుప్పిని గుర్తు తెలియని ఓ వాహనం ఢీకొట్టడంతో ఆదివారం మృతి చెందింది. ఫారెస్ట్‌రేంజర్ ఆఫీసర్ ఎం.అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. నవభారత్ కలెక్టరేట్ సమీపంలో అటవీ ప్రాంతం నుంచి బీసీఎం జాతీయ రహదారిపైకి వచ్చిన దుప్పిని పాల్వంచ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో దుప్పి అక్కడిక్కడే మృతి చెందగా.. స్థానికుల అందించిన సమాచారంతో ఫారెస్ట్ రేంజర్ సంఘటనా స్థలాన్ని సందర్శించి దుప్పికి పోస్ట్‌మార్టం నిర్వహించి ఖననం చేయించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా అటవీ ప్రాంతం అంతరించిపోతుండడం, నీటి ఆవాసాలు లేకపోవడంతో వన్య ప్రాణులు ఇలా రోడ్లు, ప్రజా సంచారంలోకి వచ్చి ప్రాణాలు కోల్పోతున్నాయని పలువురు వాపోతున్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులపై తల్లిదండ్రుల దాడి

మాదకద్రవ్యాల విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

పాల్వంచ: కిన్నెరసాని గిరిజన గురుకుల (ప్రతిభ జూనియర్) కళాశాలలో ఆదివారం ఇంటర్మీడియట్ విద్యార్థులను కొందరు తల్లిదండ్రులు చితకబాదారు. స్థానికులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొందరు విద్యార్థులు రహస్యంగా మద్యం సేవిస్తుండడం పరిపాటిగా మారడంతో తోటి విద్యార్థులు గమనించి ప్రశ్నించడంతో మద్యం సేవించే విద్యార్థులు వారితో గొడవ పడ్డారు. ఈ విషయాన్ని బాధిత విద్యార్థులు తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావడంతో వారు ఆదివారం కళాశాలకు చేరుకుని విద్యార్థులను ఓ గదిలో తీసుకెళ్లి చితకబాదారు. దీంతో సమాచారం అందుకున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అక్కడకు చేరుకుని మాట్లాడుతూ.. గతంలో ఇటువంటి ఘటనలు తమ దృష్టికి ఎన్నడూ రాలేదని, ఉంటే తక్షణం చర్యలు తీసుకుంటామని, గొడవ చేయొద్దని చెప్పారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ రవికుమార్‌ను వివరణ కోరగా.. గొడవకు కారణమైన, ఆరోపణలు వచ్చిన విద్యార్థులను సస్పెన్షన్ చేస్తామన్నారు. ఈమధ్య కాలంలో మారక ద్రవ్యాలు రహస్యంగా తీసుకుంటున్నట్లు తమ దృష్టికి రావడంతో ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. మరలా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు.

వేధింపుల కేసు నమోదు

ఇల్లెందు: పెళ్లయిన రెండేళ్ల నుంచి కట్టుకున్న భార్యను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్న భర్తపై ఆదివారం పోలీసులు వేధింపుల కేసు నమోదు చేశారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన యలదండి నిర్మలను తన భర్త సునిల్‌కుమార్ వేధిస్తున్నాడంటూ పోలీసులను ఆశ్రయించింది. విచారణ చేసిన ఎస్‌ఐ అప్పారావు సునిల్‌కుమార్‌పై వేధింపుల కేసు నమోదు చేశారు.

సాఫ్ట్‌వేర్ కోచింగ్ పేరుతో ఘరానా మోసం

- మాయమాటలు చెప్పి మహిళ నుంచి రూ.6 లక్షలు వసూలు
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు



సాఫ్ట్‌వేర్ సెంటర్ నిర్వాహకుడు ఉప్పలాచారి

వైరా: అతనో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే వైరాలో మూడేళ్లుగా యువతీ యువకులకు, మహిళలకు ప్రముఖ కంపెనీలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పించేందుకు శిక్షణ ఇస్తున్నాడు. అంతేకాకుండా కోచింగ్‌కు వచ్చే మహిళలను ప్రేమ పేరుతో మోసం చేయడం ఆ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు పరిపాటిగా మారింది. ఈ క్రమంలో ఓ మహిళను ప్రేమిస్తున్నానని వెంట పడి ఆ తర్వాత పెళ్లి చేసుకోమని సదరు మహిళ అడగడంతో తనకేమీ సంబంధం లేదంటూ తప్పించుకు తిరుగుతున్నాడు.



వైరాలో సాఫ్ట్‌వేర్ కోచింగ్ సెంటర్

నాలుగు రోజుల కిందట బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వైరా పోలీసుల కథనం ప్రకారం.. కొణిజర్ల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఉప్పలాచారి మూడేండ్ల కిందట వైరా పాత కూరగాయల మార్కెట్ రోడ్డులో యూపీఎస్‌పీ సాఫ్ట్‌వేర్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి కోచింగ్‌కు వచ్చే వారి వద్ద నుంచి రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు ఫీజు పేరుతో వసూలు చేస్తూ సంపాదించుకుంటున్నాడు. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తేగడ గ్రామానికి చెందిన ఓ వివాహిత సాఫ్ట్‌వేర్ కోచింగ్ నిమిత్తం కోచింగ్ సెంటర్‌లో ప్రవేశం పొందింది. కోచింగ్ ఇచ్చే సమయంలోనే మహిళతో ఉప్పలాచారి పరిచయం పెంచుకుని ప్రేమ వ్యవహారం నడిపాడు. ఏడాదిన్నర పాటు ఇద్దరి మధ్య ప్రేమ నడిచింది. ఆ మహిళ వద్ద నుంచి రూ.6 లక్షలు నగదు కూడా తీసుకుని జల్సా చేశాడు. భర్తలేని సదరు వివాహితను పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో ఆమె మోసపోయింది. ఇటీవల తనను పెళ్లి చేసుకోవాలని అడగ్గా తనకేమీ సంబంధం లేనట్లు వ్యవహరించాడు. గతంలో మహిళ బంధువుల ఇంటికి వెళ్లి కూడా తాను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. తీరా మహిళ ఒత్తిడి చేయడంతో తనకేమీ సంబంధం లేదని తప్పించుకుని తిరుగుతున్నాడు. అవసరమైతే సదరు మహిళను చంపుతానంటూ బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మహిళ ఫిర్యాదు మేరకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, బెదిరింపులకు పాల్పడిన కేసు నమోదు చేశారు. ప్రస్తుతం కోచింగ్ సెంటర్‌లో వైరా, తల్లాడ, ఖమ్మం, సత్తుపల్లి, భద్రాచలం, ఏన్కూరు, మధిర, బోనకల్ అశ్వారావుపేట మండలాలకు చెందిన యువతీ యువకులు నగదు చెల్లించి కోచింగ్ తీసుకుంటున్నారు. ప్రస్తుతం సదరు వ్యక్తి కనిపించకపోవడంతో కోచింగ్‌కు వచ్చిన వారు లబోదిబోమంటున్నారు.

క్లుప్తంగా...



4,141 అడుగుల ఎత్తులో నీళ్లు!

బి.కొత్తకోట: సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులో బ్రిటిష్ పాలనలో అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నిర్మించిన బావిలో ఇటీవల కురిసిన వర్షాలకు ఊటనీళ్లు ఉబికి వస్తున్నాయి. దీంతో బావి నిండి..పైకి నీళ్లు వస్తున్నాయి. ఈ దృశ్యాన్ని సందర్శకులు విశేషంగా తిలకిస్తున్నారు. 144 ఏళ్ల క్రితం హార్సిలీకొండలో నీటికోసం అప్పటి ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల కలెక్టర్ డబ్ల్యూ.డి.హార్సిలీ నిర్మించిన బావి నేటికీ చెక్కు చెదరలేదు. పటిష్టమైన రాతికట్టడంతో నిర్మించిన ఈ బావి ప్రస్తుతం పర్యాటక ప్రదేశంగా మారింది.

శాస్త్రీయ సంగీతంతో మనో వికాసం

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



విజయవాడ కల్చరల్: శాస్త్రీయ సంగీతం నిరంతరం ప్రవహించే గంగా ప్రవాహం వంటిదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ, ఏపీ పర్యాటక శాఖ, కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ, కేంద్ర టెక్స్‌టైల్ శాఖ ఆధ్వర్యంలో 3 రోజులపాటు నిర్వహించే కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం సంగీత సాహిత్యాలకు పెద్దపీట వేస్తోందని అభినందించారు. శాస్త్రీయ సంగీతం వల్ల మనో వికాసం కలుగుతుందని చెప్పారు. రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి రోజా మాట్లాడుతూ..భారతీయ సంగీత సంప్రదాయాలు విశిష్టమైనవన్నారు. తెలుగు రాష్ట్రాల పునర్విభజన జరిగాక ఏపీలో తొలిసారిగా కేంద్రం సహకారంతో విజయవాడలో 3 రోజులపాటు కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఏపీ బాటలో కేంద్రం

- రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్యం
- కేంద్ర రోడ్డు రవాణా శాఖ నిర్ణయం

సాక్షి, అమరావతి: రోడ్డు ప్రమాదాల్లో చోటుచేసుకుంటున్న మరణాల సంఖ్యను తగ్గించేందుకు ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాన్ని దేశమంతటా ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. దీనిపై విధి విధానాలు రూపొందించాల్సిందిగా కేంద్ర రోడ్డు రవాణా శాఖను కేంద్ర ప్రభుత్వం ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ నేర గణాంకాల సంస్థ(ఎన్సీఆర్‌బీ) తాజా నివేదిక ప్రకారం గత ఏడాది దేశవ్యాప్తంగా 4,46,768 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. వాటిలో 4,23,158 మంది గాయపడగా.. 1,71,100 మంది మరణించారు. వారిలో గోల్డెన్ అవర్‌లో మెరుగైన చికిత్స అందకపోవడంతో దాదాపు 50వేల మంది మరణించినట్టు అంచనా. రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన చికిత్స అందించే దిశగా పోలీస్, రవాణా, ఆర్ అండ్ బీ, వైద్య–ఆరోగ్య శాఖలను సమన్వయపరుస్తూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. దాంతోపాటు రోడ్డు ప్రమాద బాధితులను వెంటనే ఆస్పత్రికి తరలించే సామాన్యులను ప్రోత్సహించేందుకు 'గుడ్ సమరిటన్' విధానంలో నగదు ప్రోత్సాహకాలు అందిస్తోంది. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు లేకపోవడంతో ఇతర విధానాలపై కేంద్ర రవాణా శాఖ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశంలో ఆరు రాష్ట్రాలు అమలు చేస్తున్న నగదు రహిత వైద్య విధానంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రోడ్డు ప్రమాద బాధితులకు దేశవ్యాప్తంగా నగదు రహిత వైద్య విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. గోల్డెన్ అవర్‌గా పరిగణించే రోడ్డు ప్రమాదం సంభవించిన తరువాత తొలి గంటలో అత్యవసర చికిత్సతోపాటు అన్నిరకాల ట్రామా కేర్, ఇతర వైద్య సేవలను పూర్తిగా నగదు రహిత చికిత్స అందిస్తారు. ప్రమాద స్థలానికి సమీపంలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో తప్పనిసరిగా నగదు రహిత వైద్యం అందించే దిశగా విధి విధానాలను రూపొందించనుంది. నగదు రహిత విధానంపై నివేదిక ఇవ్వాలని ఏపీ రవాణా శాఖతోపాటు ఆయా రాష్ట్రాలను కూడా కోరింది. దీనిపై రెండు నెలల్లో నివేదిక సమర్పించిన తరువాత దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్యసేవల విధానాన్ని అమలులోకి తీసుకురావాలని భావిస్తోంది.





వైఎస్సార్ జిల్లా కమలాపురం చెన్నూరులో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

కమలాపురం.. జనసంద్రం

- చెన్నూరు సభకు పోటెత్తిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- డప్పుల చప్పుళ్లతో, ఆటపాటలతో ప్రాంగణానికి చేరిక
- నేతలు సీఎం జగన్ పేరు ప్రస్తావించగానే.. సభికుల చప్పట్లు,
- అణగారిన వర్గాల ఆశా జ్యోతి జగనేనని నేతల ప్రశంసలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పోటెత్తారు. చెన్నూరులో నిర్వహించిన బహిరంగ సభకు జనం వెల్లువలా తరలివచ్చారు. వివిధ గ్రామాల నుంచి డప్పుల దరువులు, ఆటపాటలతో ప్రజానీకం ర్యాలీగా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ఇలా వేలాది మంది తరలి రావడంతో సభాస్థలిలో అందరూ కూర్చునే పరిస్థితి లేకుండా పోయింది. వెరసి చెన్నూరులో ఎటు చూసినా, ఏ వీధిలో చూసినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వైఎస్సార్‌సీపీ జెండాలను రెపరెపలాడిస్తూ కనిపించారు. కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు తమ ప్రసంగాల్లో సీఎం జగన్ పేరును ఉచ్చరించగా.. సభికులు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు.

అంబేడ్కర్ ఆలోచన విధానాలు అమలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావ్ పూలే, కొమురం భీమ్ వంటి మహనీయుల ఆలోచనలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ అన్నారు. అణగారిన వర్గాలకు అండగా, భావి తరాల ఉన్నతికి దూరదృష్టితో పెద్దపీట వేస్తున్న వైఎస్ జగన్‌ను మరోమారు మన కోసం ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కామెడీ యాక్టర్ పవన్, నయవంచకుడు చంద్రబాబు కలిసికట్టుగా వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మొద్దని సూచించారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన అడ్రస్ గల్లంతు

- టీడీపీతో పొత్తు వల్లే తెలంగాణలో కాంగ్రెస్‌కు ఆంధ్రా సెటిలర్స్ దూరం
- ఏపీ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి పునరావృతం: బాలినేని



ఒంగోలు: వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ అడ్రస్ లేకుండా పోతాయని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఒంగోలులోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు వత్తాసు పలికితే.. జనసేన మరో జాతీయ పార్టీ బీజేపీతో పొత్తుపెట్టుకుందన్నారు. ఏపీలో అనైతిక పొత్తు ద్వారా టీడీపీ–జనసేన ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాయని స్పష్టమవుతోందన్నారు. ఇటువంటి నైతికతలేని పొత్తులను ఆంధ్రా ప్రజలు అంగీకరించరని చెప్పారు. కాంగ్రెస్ గెలుపు తమ వల్లే అంటూ టీడీపీ వాళ్లు చేసుకున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆంధ్రా సెటిలర్స్ అంతా బీఆర్ఎస్‌కే మద్దతు పలికి గెలిపించారని.. కనీసం కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కలేదని చెప్పారు. టీడీపీతో పొత్తు వల్లే తెలంగాణలో కాంగ్రెస్‌కు ఆంధ్రా సెటిలర్స్ దూరం అయ్యారన్నారు. టీడీపీ కూడా ఫలితాలు వెలువడిన ఒకటి రెండు రోజులు హడావుడి చేసి.. ఆ తరువాత జనానికి విషయం అర్థం అయిందని తెలియగానే గప్‌చుప్ అయిందని చెప్పారు. టీడీపీ అంటేనే ఆంధ్రా ప్రజానీకం అసహ్యించుకునే పరిస్థితి నెలకొందన్నారు. టీడీపీ వారు రోడ్డు మీదకు రావడాన్ని తట్టుకోలేకనే తెలంగాణలో కాంగ్రెస్‌కు దూరంగా ఉన్నారని, రేపు ఆంధ్రాలో జరిగే సాధారణ ఎన్నికల్లో టీడీపీ అడ్రస్ కూడా గల్లంతవుతుందని చెప్పారు.



పాడేరులో ఉదయం 9 గంటలకు కురుస్తున్న పొగమంచు

చింతపల్లిలో 11, అరకులో 12.3 డిగ్రీలు

అల్లూరి జిల్లాలో గణనీయంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు పాడేరు, చింతపల్లి, అరకులోయ ప్రాంతాల్లో మంచుతెరలు వీడటం లేదు. ఘాట్ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కారణంగా లైట్ల వెలుగులో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఉష్ణోగ్రతలూ రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం 15.5 డిగ్రీలు నమోదు కాగా ఆదివారం 4.5 డిగ్రీలు తగ్గి 11 డిగ్రీలు నమోదైంది. అరకులోయ కేంద్ర కాఫీ బోర్డులో 12.3 డిగ్రీలు, పాడేరు మండలంలోని మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద 13 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు కాఫీబోర్డు వర్గాలు తెలిపాయి. ఆయా ప్రాంతాల్లో సాయంత్రం నుంచి చలిగాలులు విజృంభిస్తున్నాయి.

మంచు అందాలకు ఫిదా...

జిల్లా వ్యాప్తంగా చలిగాలుల తీవ్రత ఉన్నప్పటికీ మంచు అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చి అందాలను వీక్షిస్తూ పరవశిస్తున్నారు. మారేడుమిల్లి ప్రాంతంలోని గుడిసె, చింతపల్లి మండలంలోని లంబసింగిలోని చెరువులవెనం, పాడేరు మండలంలోని వంజంగి హిల్స్, హుకుంపేట మండలంలోని సీతమ్మకొండ, అరకులోయ మండలంలోని మాడగడ హిల్స్ ప్రాంతాలకు వేకువజామునే చేరుకుని పొగమంచు, సూర్యోదయం, మేఘాల అందాలను వీక్షిస్తున్నారు.



మాడగడ హిల్స్‌లో పర్యాటకులు

జిల్లా వార్తలు

రోజుకో రూపంలో రామయ్య దర్శనం

ఈనెల 13 నుంచి ముక్కోటి అవతారాలు

- 22న తెప్పోత్సవం, 23న ఉత్తర ద్వార దర్శనం
- జనవరి 08 న స్వామి వారికి విశ్వరూప సేవ
- తిలకించి పులకించనున్న భక్తజనం



రామాలయంలో విశ్వరూప దృశ్యం

భద్రాచలం : భూలోక వైకుంఠం భద్రగిరి ముక్కోటి ఉత్సవాలకు సిద్ధమవుతోంది. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో శ్రీ వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ఈనెల 13 నుంచి ప్రారంభం కానున్నాయి. దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో జగదభిరాముడికి జరిగే వేడుకల్లో ఇది ప్రత్యేకమైనది. 13 నుంచి జనవరి 02 వరకు అధ్యయనోత్సవాలు, 3 నుంచి నుంచి 5 వరకు విలాసోత్సవాలు, 8న స్వామివారికి విశ్వరూప సేవ జరపనున్నారు. దేవతలందరినీ ఒకే చోట కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేస్తారు. విశ్వరూప సేవ కేవలం భద్రాచలంలో రామయ్యకు మాత్రమే జరిగే ప్రత్యేక వేడుక కావడం విశేషం. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈనెల 13 నుంచి 22 వరకు పగల్ పత్తు ఉత్సవాలు, 23 నుంచి జనవరి 2 వరకు రాపత్తు ఉత్సవాలు జరుగుతాయి. పగల్‌పత్తు ఉత్సవాల్లో స్వామివారు తొమ్మిది అవతారాలలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఉత్తర ద్వార దర్శనం ప్రత్యేకత

సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించిన సమయం దేవతులకు బ్రహ్మముహూర్త కాలం. ఈ పరమ పవిత్రమైన కాలంలో వచ్చే శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి అంటారు. ముక్కోటి దేవతలు శ్రీ మహావిష్ణువును వైకుంఠంలోని ఉత్తరద్వారం నుంచి ఈ ఏకాదశి రోజే దర్శిస్తారని, అందుకే దీనికి ముక్కోటి ఏకాదశి అని మరోపేరు ఉందని పండితులు చెబుతున్నారు. ఈ పవిత్ర దినోత్సవాన్ని మధ్యపణిపూసగా చేసుకొని ముందు పదిరోజులు పగల్ పత్తు, వెనుక పదిరోజులను రాపత్తు ఉత్సవాలు నిర్వహిస్తారు.



గోదావరిలో తెప్పోత్సవం (ఫైల్)



వైకుంఠ ద్వార దర్శన పూజల్లో భక్త జనం

స్వామివారి అవతారాలిలా..

మత్స్యావతారం (ఈనెల 13న)



శ్రీ మహావిష్ణువు ధరించిన అవతారాల్లో మెదటిది మత్స్యావతారం. దీనికి సంబంధించి రెండు పురాణ గాధలు ఉన్నాయి. జ్ఞాననిధులైన బ్రహ్మ నుంచి అపహరించి సముద్రంలో దాగి ఉన్న సోమకాసురిని సంహరించడానికి మత్స్యావతారం ధరించి వేదాలను ఉద్ధరించాడు. రెండోది నావలో ఉన్న వైవస్వత మనువును, సప్తరుషులను, సృష్టికి అవసరమైన విత్తనాలను, ఔషధాలను జలప్రళయం నుంచి రక్షించాడు. ఈ అవతారాన్ని పూజిస్తే కేతు గ్రహ బాధలు తొలగుతాయని ప్రతీతి.

కూర్మావతారం(14వ తేదీ)



అమృతం కోసం క్షీరసాగరాన్ని చిలుకుతున్న సమయంలో ఏ ఆధారం లేక మంధరగిరి మునిగిపోగా, దేవతలు, రాక్షసుల ప్రార్థనపై శ్రీహరి కూర్మావతారాన్ని ధరించి మునిగిపోయిన మంధర పర్వతాన్ని తన వీపున నిలుపుకొని పైకెత్తి సహాయపడ్డాడు. ఈ అవతారాన్ని దర్శిస్తే శని గ్రహ దోషాలు తొలగుతాయని పండితులు చెబుతున్నారు.

వరాహావతారం (15వ తేదీ)



ప్రజాసృష్టి చేద్దామనుకున్న స్వయంభువుని, బ్రహ్మాదుల మొరవిన్న నారాయణుడు నీటిలో మునిగి ఉన్న భూమిని బయటికి తీయడానికి వరాహావతారాన్ని ధరించాడు. భూమిని తన కోరలతో పైకెత్తాడు. ఈ కార్యంలో ఆటంకం కలిగించిన లోకకంటకుడైన హిరణ్యాక్షుడు అనే రాక్షసుడిని సంహరించి భూమిని రక్షించాడు. ఈ అవతారంలో ఉన్న స్వామి వారిని దర్శిస్తే రాహుగ్రహబాధలు తొలగుతాయి.

నరసింహావతారం (16వ తేదీ)



తన ప్రియభక్తుడైన ప్రహ్లాదుని అనేక బాధలకు గురిచేస్తున్న హిరణ్యకశిపుడు అనే రాక్షసుడిని సంహరించడానికి నారాయణుడు నరసింహావతారాన్ని ధరించాడు. ఈ అవతార నిడివి స్వల్పకాలమైనా.. భగవానుని సర్వవ్యాపకతను తెలియజేస్తుంది. భూత గ్రహ బాధలు, కుజ గ్రహ బాధలు ఉన్నవారు ఈ అవతారాన్ని పూజిస్తే విముక్తి పొందుతారని శాస్త్రం చెబుతోంది.

వామనావతారం (17వ తేదీ)



దేవతల సర్వసంపదలను తన స్వాధీనం చేసుకున్న రాక్షస రాజైన బలిచక్రవర్తి దగ్గరికి శ్రీహరి వామన రూపంలో వెళ్లి మూడు అడుగులు దానంగా స్వీకరిస్తాడు. ఒక అడుగుతో భూమిని, రెండో అడుగుతో ఆకాశాన్ని, మూడో అడుగుని బలి తలపై మోపి త్రివిక్రముడవుతాడు. ఈ అవతారాన్ని దర్శించటం వలన గురు గ్రహ బాధలు తొలుగుతాయని వేదపండితులు చెబుతున్నారు.

పరశురామావతారం (18వ తేదీ)



శ్రీ మహావిష్ణువు జమదగ్ని అనే మహర్షికి కొడుకుగా జన్మించి పరశురాముడి (భార్గవరాముడు)గా దుష్టులైన కార్తవీర్యార్జునుని, దుర్మార్గులైన రాజులను ఇరవై ఒక్క సార్లు దండెత్తి సంహరించి ధర్మాన్ని స్థాపించాడు. శుక్ర గ్రహ బాధలున్నవారు ఈ అవతారాన్ని దర్శిస్తే శుభ ఫలితాలు పొందుతారని ప్రతీతి.

శ్రీరామవతారం (19వ తేదీ)




దశరథుడి కుమారుడిగా శ్రీమన్నారాయణుడు ధరించిన అవతారం శ్రీరామావతారం. వ్యక్తిగత సౌఖ్యాల కన్నా ధర్మాచరణే ఉత్తమమని, అదే శాశ్వతమని భావించి, పరిపూర్ణ మానవుడు ఎలా ఉండాలో ఆచరించి చూపించిన ఆదర్శ పురుషుడు శ్రీరాముడు. సూర్యగ్రహ బాధలున్నవారు రామావతారాన్ని దర్శిస్తే విముక్తి పొందుతారు.

శ్రీబలరామావతారం (20వ తేదీ)



శ్రీహరికి శయనమైన ఆదిశేషుని అంశతో జన్మించి, 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న నానుడికి ప్రతీకగా నాగలిని ఆయుధంగా ధరించి శ్రీకృష్ణునికి అన్నగా నిలిచి, ఆయనకు ధర్మస్థాపనలో సహకరించిన అవతారం శ్రీ బలరామావతారం. ఈ అవతారాన్ని దర్శించిన వారికి మాందిగుళికా గ్రహాల బాధలు తొలగిపోతాయి.

శ్రీకృష్ణావతారం (21వ తేదీ)



దేవకీ వసుదేవలకు అష్టమ సంతానంగా జన్మించి, కురుక్షేత్ర సంగ్రామంలో ఉపనిషత్తుల సారాంశమైన భగవద్గీతను అర్జునునికి బోధించి మానవ ఆదర్శాలను, ధర్మాన్ని స్థాపించిన శ్రీమన్నారాయణుని పరిపూర్ణ అవతారం శ్రీకృష్ణావతారం. ఈ అవతారాన్ని దర్శిస్తే చంద్ర గ్రహ బాధలు తొలగుతాయి.

జీవితంలో ప్రశాంతతను ఇచ్చేవి కళలే..

ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి



ప్రసంగిస్తున్న సినీనటుడు తనికెళ్ల భరణి

సత్తుపల్లిటౌన్: భవిష్యత్ తరాలు అద్భుతంగా ఉండాలంటే భక్తిభావం, సంస్కారం పెంపొందించాలని ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి అన్నారు. సత్తుపల్లిలోని శ్రీగణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన మనగుడి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సకలజన కార్తీక వనసమారాధనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్యం నుంచే ఆలయాలను సందర్శించే విధంగా ప్రోత్సహించాలన్నారు. అసాధ్యమైనది ప్రపంచంలో ఏదీ లేదని, పట్టుదలతో సాధించవచ్చన్నారు. జీవితంలో ప్రశాంతత ఇచ్చేవి కళలేనని, పిల్లల్లో ఆసక్తి ఉన్న క్రీడలు, కళలను ప్రోత్సహించాలని సూచించారు. పలు భక్తి పాటలు పాడి గణపతి విశిష్టత, శివతత్వాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం సకలజనుల వన భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు బాలాజీ, కూసంపూడి శ్రీనివాసరావు, నాయుడు వెంకటేశ్వరరావు, లక్కినేని ప్రసాద్, గాదిరెడ్డి రాంబాబురెడ్డి, దారా ఏకాదశ మూర్తి, రాజు, రామకృష్ణ, ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, బాబురావు, లింగారెడ్డి, రాజరత్నాచారి, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

గురువు అనుగ్రహం ఉంటే అంతా శుభమే



మాట్లాడుతున్న సిద్ధాంతి మాచిరాజు వేణుగోపాల్

ఖమ్మంగాంధీచౌక్: గురువు అనుగ్రహం ఉంటే అంతా శుభమే జరుగుతుందని హస్త సాముద్రిక సామ్రాట్, అమరావతి సిద్ధాంతి డాక్టర్ మాచిరాజు వేణుగోపాల్ అన్నారు. శ్రీ సాయి భజన మండలి సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవం ఆదివారం ఖమ్మంలోని వాసవీ గార్డెన్స్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల్ మాట్లాడుతూ.. సాయి అంటే గురువని, అలాంటి గురువు అనుగ్రహం ఉంటే తలపెట్టిన అన్ని కార్యక్రమాలూ విజయవంతంగా సాగుతాయని తెలిపారు. దత్తాత్రేయ గురు చరిత్ర, సాయిబాబా జీవిత చరిత్రను చదివితే జన్మజన్మల పాపాలకు ప్రక్షాళన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సాయి భజన మండలి అధ్యక్షుడు గన్నవరపు నాగేశ్వరరావు, వేముల పల్లి వెంకటేశ్వరరావు, కటకం చిన్నబాబు, చెరుకూరి కృష్ణమూర్తి, చిన్ని కృష్ణారావు, అర్వపల్లి నిరంజన్, పసుమర్తి లక్ష్మీనారాయణ, కొదుమూరి మధుసూదన్, దమ్మాలపాటి సుధాకర్, చెన్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో జిల్లా జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ జట్టును ఆదివారం ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి 40 మంది క్రికెటర్లు పాల్గొనగా.. జిల్లా క్రీడల సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసా కలీం జిల్లా జట్టుకు ఎంపికైన వారిని ప్రకటించారు. జిల్లా జట్టులో ఎస్.కె.అమర్, జి.రిషికేశ్, పి.శివకుమార్, బి.కృష్ణబాలాజీ, ఐ.లియో, ఎస్.రికేశ్, జె.మనోభిరాం, టి.లక్ష్మీధరణ్, పి.చక్రవర్త, వి.స్టీఫన్, కె.సిద్ధికుమార్, ఆర్.జయవిష్ణుతేజ్, ఎం.రిషినవనీత్, పి.రాజేశ్, వి.నక్షత్‌కుమార్, టి.టి.సాత్విక్, స్టాండ్‌బైలుగా ఎస్.కె.ఫైసల్ ఇమ్రాన్, బి.శివరామకృష్ణ, బి.కౌశిక్‌కుమార్‌లు ఉన్నారు.

ఆటపాటల్లో రాణించాలి



మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. ఆదివారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయిలో అండర్-14 విభాగంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో రాణించిన వారిని ఈ నెల 13,14, 15 తేదీల్లో మహబూబ్ నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పంపిస్తారని తెలిపారు. విద్యార్థులు సత్తా చాటాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ బోళ్ల వెంకటేశ్వర్లు, సహాయకులుగా డాక్టర్ వీరు నాయక్, కాంతారావు పాల్గొన్నారు.